# కళ్యాణి

తీరుబడిగా కూచుని ఆలోచిస్తోంటే గడచిన సంఘటనలన్నీ గుర్తు కొచ్చి మనసును చీకాకు చేస్తున్నై. ''గతంనాస్తి'' అనుకుని కొత్త బతుకు ప్రారంభించటం యీ జన్మకు కుదరదు కద!

తల్లికి అయిదో సంతానం తను. తొమ్మిది నెల్లూ తల్లి కడుపులో దాక్కొని, ఒకానొక ప్రభాత సమయాన తను కళ్ళు విప్పి యీ ప్రపంచాన్ని చూచేందుకు యివతల పడితే, ఎవరూ సంతోషపడ్డవాళ్ళు లేరు! ఆఖరుకు కన్నతల్లి కూడా అనుకున్నది – నీవు చచ్చిపోతేనే, నీపీడ నాపీడా వదలిపోతుంది – అని! కాని, ఎవరికీ యిష్టం లేకపోయినా తను అట్లానే పెరిగి పెద్దవాడవుతున్నాడు. తన మూడో కాన్పుకీ, నాలుగో కాన్పుకీ కూడా యిట్లాగే అనుకున్నట్టు అమ్మ యీ నాటికీ చెబుతుంది. అయితే నేం, ఒట్టి మాటలవల్ల ప్రయోజనం ఏముంది కనుక–?

ఎత్తుల్లో భేదం మినహాయించి తాము అన్నదమ్ములు అయిదుగురూ ఒకటే పోలిక. వయసులో గూడా సంవత్సరం సంవత్సరంన్నరా కంటే తేడాలేదు, ఎడపిల్లాడికి ఏడాది నిండీ నిండకముందే మరోడు తయారయి తనరొమ్ములమీదా, ఉయ్యాలమీద అధికారం ప్రతిష్ఠించుకుంటున్నాడని అమ్మ ఆరోపణ! చంకలో ఒకడూ, చేతులలో ఒకడూ!

తండ్రి మిల్లులో పని చేసేవాడు. ఒకనాడు ఇద్దరు ఆయన శవాన్ని మోసుకొచ్చి యింట్లో పడేశారు. శరీరం నిండా దుమ్ము, నెత్తురు మరకలు. వాళ్ళు చెప్పబట్టి గాని లేకపోతే అది ఎవరి శవమో కనుక్కోటం ఎవరికీ సాధ్యంకాదు. ముఖం, నడుమూ, కాళ్ళూ అన్నీ ఒకటే మాంసం ముద్ద! మిల్లుయంత్రం 'గేరు'లో యిరుక్కుని నాలుగయిదు ప్రదక్షిణాలు చేసిన ఫలితం యిది.

----అప్పటికి తనకు నాలుగో ఏడు నడుస్తూన్నది. అయినా యీ సంఘటన యింకా తన కళ్ళముందు కట్టినట్టే కానవస్తోంది. నెత్తురు ముద్దమీద పడి, తల్లి మింటికీ మింటికీ ఏకధారగా ఏడ్చిన ఏడుపులూ, యిరుగు పొరుగు వాళ్ళ అనునయ వాక్యాలూ అన్నీ బాగా గుర్తే! ఒక్క పావు గంటలో యిల్లంతా ఊరిజనంతో నిండి పోయింది. పక్క

వీధిలోనే వుంటున్న "మామ" పరుగెత్తుకు వచ్చాడు. కాని ఏం లాభం?– నాన్న మరి లేడు. ఒక్కొక్కళ్ళే వచ్చి శవం మీద కప్పిన గుడ్డ ఎత్తి చూచి భయపడ్డట్టు వెనక్కి వాలటం, మనసుకు తోచిన మాటలు నాలుగు అనటం – యిట్లా చాలాసేపు గడిచింది.

"పోయినవాడు అదృష్టవంతుడే! వీరస్వర్గం అలంకరిస్తాడు. కాని యీ పసికందుల గతేం కాను? దమ్మిడి ఆస్తి లేని ఆ విధవరాలి ముఖం ఎవరు చూస్తారు?" అని అందరూ సానుభూతి చూపారు. ఈ మాటలు వింటున్నకొద్దీ అమ్మ ఆవేదన ఎక్కువవుతోంది. తల గోడకేసి బాదుకొంటూ తనని కూడా తీసుకెళ్ళమని దేవుణ్ణి ప్రార్థిస్తోంది.

తండ్రి పోయిన తర్వాత యిల్లంతా ఎడారిలా తయారయింది. ఎవరికీ గట్టిగా మాట్లాడటానిక్కాని, తీరుబడిగా ఆలోచించటానిక్కానీ లేకుండాపోయింది. మొత్తంమీద, యింటి వాతావరణమే తారుమారయిపోయింది. ఇదివరకులా "మామ" మేనల్లుళ్ళని చెవులు పట్టుకు పైకెత్తటం లేదు. ఇరుగు పొరుగు వాళ్ళు కూడా పిల్లల్ని జాలిగా చూస్తున్నారు. వీలుచిక్కినప్పుడల్లా తమ యిళ్ళకు తీసుకుపోయి తిను బండారాలు పెడుతున్నారు. చేతనయినంత సహాయమూ చేస్తున్నారు. అమ్మ తెల్లవారుజామునే యింత వుడకేసి, పెద్దన్నయ్యకు చూపించి, తను వెళ్ళిపోయేది. ఎవరి పొలంలోనో కలుపు తియ్యటమో, నారు వెయ్యటమో, తోటకు నీళ్ళు పెట్టటమో, యింట్లో పనులు చూసిపెట్టటమో చేసి బాగా చీకటి పడ్డాక ఇంటికి చేరుకునేది. వచ్చేటప్పుడు ఒడిలో ఏ కూరగాయలు, ధాన్యం ----లేకపోతే బియ్యమో, జొన్నలో తెచ్చేది. ఒక్కొకప్పుడు బాగా చీకటిగా వుండగనే బయల్దేరి వెళ్ళేది. రాత్రి పదీ, పదకొండు దాటితే గాని వచ్చేది కాదు. ఆమె యిట్లా కష్టపడేది కనకే, తమకు తిండికేమీ యిబ్బంది కలిగేది కాదు. వేసవికాలం అంతా యిట్లా హాయిగానే గడిచిపోయింది. కాని రోజులు దొర్లిపోయిన కొద్దీ పొలం పనులు తక్కువయిపోయి ఆమెకు పిలుపులే వచ్చేవి కావు. అమ్మకంటే గూడా, మామ ఎక్కువగా పైకి తేలేవాడు. "ఉన్న ఒక్క గొడ్డునీ అమ్మేసుకున్నాను. ఇంక చేసేదేమీ కనపడటం లేదు. ఈ ప్రకారంగానే అయితే, యిక ఆకలికి తట్టుకోలేక ఎప్పుడో గుటుక్కుమంటాం."

"ఒక్కడివి, నువ్వే అట్లా బాధపడితే, యీ అయిదుగురు పసికూనలూ నేను ఎట్లా దావాలో చెప్పు. దమ్మిడి ఆదాయం కనిపించదు. వీళ్ళకు తిండి ఏం పెట్టేదీ, బట్టలేం కట్టేది. ఇంక వాళ్ళూ నేనూ కట్ట గట్టుకు ఏ పాడుబడ్డ నూతిలోనో దూకటమే

మార్గం!'' అనేది అమ్మ.

''ఏమిటే అంత తెలివి తక్కువగా మాట్లాడతావ్, కాస్త కాలం మారనీ, నీ పెద్దాడిని ఎవరేనా కాపలాకి కుదుర్చుకుంటారేమో చూదాం'' అనేవాడు మామ ఆమె నోదారుస్తూ.

''ఒకడూ, యిద్దరూ కాదు. నా ప్రాణానికీ అయిదుగురూ!'' అని అమ్మ నిట్టూర్చేది.

బొత్తిగా ఏమీ పని దొరకనప్పుడు ఆమె సహనం పూర్తిగా చచ్చిపోయేది. విసుగుకొద్దీ తమ మీద విరుచుకుపడేది! ''యిచ్చిందేమిటో తిని ఒక మూలపడి చావండి. మీకూ అడుక్కుతింటే గాని కష్ట సుఖాలు తెలిసిరావు'' అనేది.

మేకపిల్లల్లాగ పిల్లలయిదుగురూ తలో మూలా చేరి కడుపులో కాళ్ళు పెట్టుకు పడుకుంటే, ఆమె హృదయం తల్లడిల్లిపోయేది. అందరికన్నా ముఖ్యంగా అయిదో వాడయిన తనని దగ్గరికి తీసుకుని, వళ్ళో కూచోపెట్టుకుని ---- తల నిమురుతూ ''నువ్వు చాలా దుర్ముహూర్తాన పుట్టావురా బాబూ'' అనేది. గుండెలకు గాఢంగా హత్తుకుని హృదయవేదన కప్పిపుచ్చుకుందుకు, పాట పాడేది. గొంతు వణికిపోయేది. కళ్ళు తేలిపోయేవి. ముఖ కవళికలే మారిపోయేవి. ఆ క్షణంలో ఆమె వేపు చూడటమంటేనే తనకు భయంగా వుండేది. మళ్ళీ శీతాకాలం వచ్చి నాలుగు పనులు దొరికితే. తెల్లవారుజామునే వెళ్ళి రాత్రి పొద్దు పోయాక తిరిగొచ్చేది. చీకటి పడటంతోటే తలుపు వేసుకుని, ఆమె రాకకోసం ఎదురుచూస్తూ కూచునేవాళ్ళు. అయితే, ఆమె రాకముందే నిద్రాదేవి ఒడిలో సుఖంగా పడుకునేవాళ్ళు. ఏ పీడ కలో వచ్చి అర్థరాత్రి లేచి చూచేటప్పటికి, ఆమె తల చేత్తో పట్టుకొని దీపం పక్క గుమ్మంమీదకూచుని దీర్ఘంగా ఆలోచిస్తోందటమో లేక తమ బట్టలు మరామత్తు చేయటమో, వుతకటమో----తను చాలాసార్లు గమనించాడు.

మామ ఎప్పుడూ ఆమె యింట వున్నప్పుడే వచ్చేవాడు. ''యిప్పుడు మనం ఏం చేసేట్టు? మన గతి అడల్లో జంతువుల కూడా పట్టదు.'' ఆయన ఎప్పుడూ విశేషం వినిపిస్తూనే వుండేవాడు. అయితే, కబుర్లు చెప్పటానికి ప్రారంభించేముందు మాత్రం ఒక పట్టు నశ్యం పీల్చటం మరిచిపోయేవాడు కాదు. తనకు బాగా గుర్తు. ఒకరోజు తను పరిశీలనగా వినగా రోజూ మాటలకూ ఆనాడాయన చెబుతున్న వాటికీ ఏదో తేడా వున్నట్టు అనిపించింది. అమ్మ వినడంలో కూడా ఆ తేడా స్పష్టంగా కనిపిస్తోంది. ఎంత విశ్వప్రయత్నం చేసినా వాళ్ళు గుస గుసలాడుకున్న మాటల సారాంశం తనకు తెలిసింది

కాదు. ఇప్పుడు, మామ ఎప్పుడు యింట్లో కాలు పెట్టినా, తొందరగా అతనికో ఆసనం చూపించటం, కూర్చోమని యింట్లో తినటానికేం వుంటే అదే పెట్టటం, తనూ తీరుబడిగా ఆయన కెదురుగుండా కూర్చుని ప్రశ్నలు వెయ్యడం చేస్తూంది అమ్మ! తనకు రూఢిగా తెలుసు, ఈ ధోరణి ఇదివరకు లేదు.

"ఆ!"

"అతనింకా బెట్టు చేస్తోనే వున్నాడు. పిల్లల్ని చూచే, వాడు బెదిరిపోతున్నాడు. ఇప్పుడింకా చిన్న పల్లలే కనక ఫరవాలేదు---- కాని వాళ్ళు ఎదిగి పెద్ద వాళ్ళయినాక ఎట్లాగ?" ----అంటున్నాడు.

"అయితే వాళ్ళ విషయం వదిలేస్తే, అతని కిష్టమేగా!" అన్నది అమ్మ---- యింకా దగ్గరిగా జరుగుతూ.

"అంతేననుకుంటాను. అప్పుడు ఒప్పుకుంటాడు."

"ఇంకా ఏమన్నాడూ?"

"ఇంతకంటే అతనేమీ చెప్పలేదు. ఈ ఆదివారం అతనికి రావడానికి కుదరదు. వాళ్ళు ధాన్యం మర పట్టిస్తున్నారు. అతను యంత్రం దగ్గరే వుండాలి, మెకానిక్ కదామరి!"

"అతను మెకానిక్కా!" అంది అమ్మ, ఆ మాట ఆశ్చర్యంగా కనిపించినట్టు.

"నీ కా సంగతి తెలీనే తెలియదా ఏమిటి? అతను మొదట్నించీ కూడా మెకానిక్కు పనే చేస్తున్నాడు. అతనికేం నిక్షేపంలాంటి మనిషి."

"అయితే, అవును---- కాదు అని ఏదో మాట తేల్చి చెప్పలేదన్నమాట!"

"పై వారం ఆలోచిద్దాం..."

మామ వెళ్ళిపోవటానికి లేచాక, అమ్మ గుమ్మందాక సాగనంపి "నీ చేతనైనంతవరకూ ప్రయత్నించు. ఎట్లాగో అట్లా అతన్ని ఒప్పించాలి. ఇదంతా నా ఒక్కదాని కోసమే కాదుగా మరి! నేను చేసిన పాపం అంటూ ఏమీ లేదు----యీ అయిదుగురు పసికూనలూ తప్ప..." అన్నది.

ఆపైన నాలుగయిదు రోజులదాకా మామ ఇంటివైపు రాలేదు.

"ఇక నువ్వు నీ ప్రయత్నాలు సాగించు, చెల్లెలా!" అంటూ నవ్వుతూ వచ్చాడు. ముఖం వికసించింది. 'నిజంగానా?' అనడిగింది అమ్మ నమ్మటం చేతకాక, ఓ

నిమిషంపాటు నేలబారుగా చూస్తూ నించుంది. తర్వాత చిన్నపిల్లలు నవ్వు నాపుకోటానికి ప్రయత్నించే ధోరణిలో కొంగు ముఖానికి కప్పుకుంది. "ఇప్పుడు నీలో పెళ్ళికూతురు కళ ఉట్టి పడుతోంది" అన్నాడు మామ----"ఇంతకూ విషయం ఆసాంతం విను. అతను చాలా సేపు యిదనీ అదనీ పేచీలు పెట్టుక్కూర్చున్నాడు. తనకు యింకా భయంగానే వున్నదంటాడు. ఇద్దరు మగ్గురయితే ఫరవాలేదు కాని, ఏకంగా ----ఒక్క బిగిని, అయిదుగురు పిల్లలు కదా అని వాపోతాడు. వాళ్ళందరినీ పెట్టి పోషించి ఒక యింటివాళ్ళని చెయ్యటమంటే మాటలు కాదంటాడు. ఆఖరుకు, ఏమయితేనేం, బలవంతాన ఒప్పించాను" ఇంతవరకూ ఓపిగ్గావిన్న అమ్మ యీ పైన వినలేకపోయింది. మెల్లిగా పక్కనున్న బల్లమీదికి జారబడి ముఖం కిందికి దించుకుని కన్నీరు కార్చసాగింది.

"అయ్యో! అదేమిటి, పిచ్చిదానా. శుభ సమయాన కన్నీరు కార్చకు."

అవమాన భారంతో ఆమె ఏడుపు మానింది. కన్నీళ్ళొత్తుకుని, జుత్తు సవరించుకుని గాద్గదికంగా అన్నది: "నాకొక్కటే విచారం. నువ ఏ లెక్క ప్రకారమయినా చూడు, కొత్తవాడు కొత్తవాడే! అతనెప్పుడూ వీళ్ళను స్వంత తండ్రిలా చూడలేడు, అట్లా లాలించలేడు, అనునయించలేడు."

ఒకనాడుదయానే లేచేసరికి అమ్మ పక్కన ఎవరో కొత్త వ్యక్తి కూర్చోనుండటం గమనించాడు తను. వాళ్ళిద్దరూ ఒకే బెంచిమీద కూచుని మాట్లాడుకుంటున్నారు. వాళ్ళ ముఖాలు తీవ్రంగా ఆలోచిస్తోన్నట్టు చాలా గంభీరంగా వున్నాయి. అతన్ని యింతకుముందెన్నడూ చూచిన జ్ఞాపకం లేదు.

అతను చివరికిలా అన్నాడు: "సరే, యేదో ప్రయత్నాలు చేదాం, సాయశక్తులా పాటుపడదాం అందరి పొట్టలూ నింపుకుందుకు."

అమ్మ యింకా అతనికి దగ్గరిగా జరిగింది. అతని చేతులు తన చేతుల్లోకి తీసుకుంది. గట్టిగా నిట్టూర్చి అతని భుజంమీదికి వాలింది.

"అమ్మా..."

----యీ కేక తన హృదయం అట్టడుగునించీ ఎందుకంత ఉద్వేగంగా పెల్లుబికిందో యిప్పటికీ తనకు అర్థం కాదు. ఏదో సిగ్గు, అభిమానం తనచేత యిట్లా అనిపించి వుంటాయనిపిస్తుంది.

"ఏమిట్రా, నాయినా!" అంటూ అమ్మ తనని ఎత్తుకుంది.

''కలవరిస్తున్నావేమిటీ?''

టింటీ దగ్గరికి తీసుకెళ్ళి నించోబెట్టింది. తనూ ఆ కొత్త వ్యక్తీ పరస్పరం చూచుకున్నారు. అతని ముఖం చాలా అనాకారంగానూ, డోకొచ్చేట్టుగానూ అనిపించింది తనకి.

ముందుకు లాగుతూ, ''దణ్ణం పెట్టు బాబూ! యిదుగో మీ నాన్న! నువ్వంటే చాలా యిష్టంగా వుంటాడు'' అన్నది తల్లి.

ఈ మాటలకు తను అమ్మ చేతుల్లోంచి యివతలపడి అవతలకి పరిగెత్తాడు. కళ్ళ వెంట నీళ్ళు తిరిగాయి. ఆ పరుగెత్తటం, అప్పటికే లేచి కొత్త వ్యక్తి వేపు వింతగా చూస్తున్న నలుగురు అన్నలదగ్గరికీ చేరుకున్నాడు తను!

ఈ ప్రపంచంలో తనకంటే ఒంటరివాళ్ళు లేరనిపించింది! ❃

*(ఆంధ్ర ప్రభ సచిత్ర వార పత్రిక)*